క్లుప్తంగా

ఘనంగా అంబలం పూజ



అయ్యప్ప అంబలం పూజ అనంతరం హారతి ఇస్తున్న గురుస్వామి

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెంలో బుధవారం రాత్రి పెద్ద ఎత్తున అయ్యప్ప స్వామి అంబలం పూజ నిర్వహించారు. ముందుగా గ్రామంలో అయ్యప్ప మందిరాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వందలాదిగా అయ్యప్ప మాలధారణ భక్తులు హాజరయ్యారు. స్వామియే శరణమయ్యప్ప నామస్మరణతో గ్రామం మార్మోగింది. పూజా కార్యక్రమాలు జరిపి, నీరాజనం సమర్పించారు. అనంతరం అయ్యప్ప మాలధారణ భక్తులతో పాటు మిగిలిన భక్తులకు ప్రసాద వితరణ జరిపారు.

ఓటు హక్కుపై అవగాహన



మాట్లాడుతున్న డీటీ అర్జునరావు

పెందుర్తి: రాజ్యాంగబద్ధంగా వచ్చే ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని.. ఓటు హక్కు వయసు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఎన్నికల విభాగంగా డిప్యూటీ తహసీల్దార్ వి.అర్జునరావు అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా నరవ సమీపంలోని విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఓటు హక్కుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు విలువను వివరించారు. ప్రజాస్వామ్యంలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం ధర్నా నేడు

పెందుర్తి: టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అధికారం చేపట్టిన తరువాత పెరిగిన విద్యుత్, నిత్యావసర సరకుల ధరలతో పాటు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా పెందుర్తి రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.జగన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ధర్నా ప్రారంభమవుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాల్సిందిగా కోరారు.

ఆక్రమణ చెరలో.. ఆర్ అండ్ బీ రోడ్లు

శరవేగంగా అభివృద్ధి జరుగుతున్న ప్రాంతాల్లో సబ్బవరం ఒకటి. పలు జాతీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటుతో ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుతోంది. విశాఖ నగరానికి అతి సమీపంలో ఉండటంతోపాటు అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి విశాఖ వచ్చేవారికి ప్రధాన జంక్షన్ సబ్బవరం. దీంతో ఈ రోడ్లు నిత్యం రద్దీగా ఉంటాయి. అలాంటి రద్దీ రోడ్లు, డ్రైన్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తూ నిర్మాణాలు, వాణిజ్య సముదాయాలు వెలుస్తున్నాయి. నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో డ్రైన్‌లపై షాపులు



చోడవరం మార్గంలో రోడ్డును ఆక్రమించి చేపడుతున్న వాణిజ్య సముదాయాలు

- ఫుట్‌పాత్‌లు, డ్రైన్లపైకి చొచ్చుకొస్తున్న దుకాణాలు, వాణిజ్య సముదాయాలు
- పూడిక తొలగించేందుకూ వీల్లేకుండా ఆక్రమణలు
- తరచూ మురుగు తిప్పలు, ట్రాఫిక్ ఇక్కట్లు
- చోద్యం చూస్తున్న అధికారులు

సబ్బవరం: విశాఖ నుంచి అనకాపల్లి, చోడవరం వెళ్లేందుకు ప్రధాన కూడలి సబ్బవరం. ఇక్కడి ఆర్ అండ్ బీ ప్రధాన రోడ్లు ఆక్రమణల చెరలో చిక్కుకున్నాయి. వాణిజ్య కార్యకలాపాలు, విద్యా సంస్థల ఏర్పాటుతో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. అదే స్థాయిలో ఉద్యోగ, వ్యాపార, దైనందిన కార్యకలాపాలూ జోరందుకున్నాయి. దీంతో ఒకప్పుడు రోడ్డుకు కాస్త దూరంగా ఉండే దుకాణ సముదాయలన్నీ ఇప్పుడు రోడ్డుపైకి వచ్చాయి. ఫుట్‌పాత్‌లు, డ్రైన్లు ఆక్రమించి మరీ నిర్మాణాలు, వ్యాపారాలు కొనసాగుతున్నాయి. అధికారులు 'మామూళ్లు'గా వ్యవహరిస్తుండటంతో విశాలమైన రోడ్డు కాస్త ఇరుగ్గా మారి, ట్రాఫిక్ సమస్యలు రివాజుగా మారాయి.

రోడ్లు ఆక్రమించి మరీ..

గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ఈ రోడ్లపై అక్రమంగా వెలసిన దుకాణాలను, వాణిజ్య సముదాయాలను యుద్ధ ప్రాతిపదికన తొలిగించారు. రోడ్లపై ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపేవారిపై కఠిన చర్యలు తీసుకుని, కేసులు నమోదుచేశారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తేవి కాదు. ప్రభుత్వం మారాక పరిస్థితిలో కూడా మార్పు వచ్చింది. రోడ్డు పొడవునా వాణిజ్య సముదాయాలు, దుకాణాలు వెలిశాయి. చాలా చోట్ల రోడ్లను అక్రమించి మరీ నిర్మాణాలు చేపడుతున్నారు. మరోవైపు వాణిజ్య సముదాయాలకు వచ్చే వినియోగదారుల వాహనాలతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

పూడిక తొలగించేందుకూ వీల్లేదు!

రోడ్లను అనుకుని ఉండే డ్రైన్లు, ఫుట్‌పాత్‌లపై షాపుల ఏర్పాటు, నిర్మాణాలతో చాలా వరకు డ్రైన్లలో పూడిక తొలగించేందుకు వీల్లేని పరిస్థితి. దీంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి ప్రధాన కూడళ్లు దుర్గంధభరితంగా మారాయి. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్ల పైనుంచి వర్షపు నీటితోపాటు మురుగునీరు చేరి ఇబ్బందికరంగా మారుతోంది. చాలా వరకు మురికివాడల్ని తలపిస్తున్నాయి. కేవలం ఈ ఆక్రమణ వల్లే ప్రధాన రోడ్లు, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు తరుచూ నీటి ముంపునకు గురవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నాయి. పంచాయతీ, మండల పరిషత్ అధికారులు చర్యలు తీసుకోకపోవడాన్ని ఆక్షేపిస్తున్నారు.

ఫిర్యాదులు చేసినా పట్టించుకోరు

ఇక్కడి రోడ్లు, డ్రైన్లు, ఫుట్ పాత్‌ల ఆక్రమణలపై ఇప్పటికే చాలాసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపానపోవట్లేదని స్థానికులు చెప్తున్నారు. ఫిర్యాదు చేసిన వారిపై దుకాణ యజమానులు బెదిరింపులకు పాల్పడిన దాఖలాలు కూడా ఉన్నాయి. వీరి ఆక్రమణలతో రోడ్లు కుదించుకుపోయి ట్రాఫిక్ సమస్యలతో పాటు, తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వీటన్నింటికీ ఇక్కడి అధికారుల లాలూచీ వ్యవహారమే కారణమన్న ఆరోపణలున్నాయి.



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ఆక్రమణలతో పూడుకుపోయిన డ్రైన్

త్వరలోనే పరిష్కరిస్తాం



సబ్బవరంలో డ్రైన్‌ల నిర్వహణ, పునరుద్ధరణ, అభివృద్ధి పనుల్ని పంచాయతీ నిధులతో చేపట్టాలి. డ్రైనేజీ సమస్యలు, రోడ్డు ఆక్రమణల వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులు మా దృష్టికి వచ్చాయి. రోడ్లకు ఇరువైపులా డ్రైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చెప్పారు. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం

24 గంటల్లో దొంగ పట్టివేత

- ఆర్ఆర్ వెంకటాపురం చోరీ కేసులో పోలీసుల ప్రతిభ
- బైక్ చోరీ కేసులో మరో దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పెందుర్తి క్రైం ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: ఓ రెస్టారెంట్‌లో జరిగిన దొంగతనం కేసును పెందుర్తి క్రైం విభాగం పోలీసులు 24 గంటల వ్యవధిలో ఛేదించారు. ఈ ప్రక్రియలో మరో కేసును కూడా ఛేదించి ఇద్దరు దొంగల్ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పెందుర్తి క్రైం విభాగం ఎస్ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాలు. ఆర్ఆర్ వెంకటాపురం సమీపంలోని అశ్వార్‌దాస్ కళాశాల ఎదురుగా ఉన్న క్రిస్పీ చికెన్ హోటల్ షట్టర్‌ను మంగళవారం రాత్రి దుండగుడు తెరిచి లోపలికి ప్రవేశించాడు. అందులో ఉన్న ఎల్ఈడీ టీవీ, బిల్లింగ్ మానిటర్, బిల్లింగ్ ప్రింటర్, ల్యాప్‌టాప్‌ను దొంగిలించాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పెందుర్తి పోలీసులు ఏసీపీ డి.లక్ష్మణ రావు, సీఐ ఎస్.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ డి.సూరిబాబు ఆధ్వర్యంలో రంగంలోకి దిగారు. ప్రాథమిక ఆధారాలతో గోపాలపట్నం ప్రాంతానికి చెందిన గనిగల్ల తోటయ్య అనే వ్యక్తి ఈ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే అతడి కదలికలను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి తోటయ్యను పట్టుకుని అతడి వద్ద ఉన్న చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

గత నెల 28న వేపగుంటలో ఓ బైక్ దొంగతనం కేసులో అక్కయ్యపాలెనికి చెందిన నిందితుడు గోదాడి హరిసంపత్ అలియాస్ హరిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయాధికారి సూర్యకళ

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి బి.సూర్యకళ తెలిపారు. తొలిరోజు పతాకావిష్కరణ, జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు, రెండో రోజు శుక్రవారం 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు గ్రంథాలయాలు–ఉపయోగాలు, 6–10 విద్యార్థులకు విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి అనే అంశాలపై వ్యాసరచన, శనివారం 3–5 తరగతుల విద్యార్థులకు జాతీయ జెండా, 6–10 విద్యార్థులకు విశాఖ బీచ్ అంశాలపై చిత్రలేఖనం పోటీలు ఉంటాయన్నారు. ఆదివారం 3–5 విద్యార్థులకు శారీరక పరిశుభ్రత', 6–10 విద్యార్థులకు చదవడం మాకిష్టం, సాహిత్య గోష్టి–ఇష్టాగోష్టి, సోమవారం పుస్తక ప్రదర్శన, మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు, ఇందిరాగాంధీ జయంతి, ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆఖరి రోజైన బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులంతా ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో గురువారం నుంచి ఈ నెల 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం తెలిపారు. వారం రోజుల పాటు గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు, పుస్తక ప్రదర్శన, కవి సమ్మేళనం, గ్రంథాలయ ఉద్యమనేతల సంస్మరణ దినోత్సవం, మహిళా దినోత్సవం తదితర విశేష కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పాఠకులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన డీఈవో

పరవాడ: స్థానిక భవిత కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు బుధవారం సందర్శించారు. సమగ్ర శిక్ష అందిస్తున్న కార్యక్రమాలు, అలవెన్స్‌ల వివరాలను దివ్యాంగుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల బాగోగులపై ఆరా తీశారు. అంతకుముందు ఎంపీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ మల్లేష్ స్నేహితుడు సీహెచ్ శ్రీనివాసరావు భవిత కేంద్రానికి వితరణగా అందించిన వాటర్ డిస్పెన్సర్‌ను డీఈవో ప్రారంభించారు. అనంతరం భవిత ప్రాంగణంలో మొక్కలు నాటారు. భవిత కేంద్రంలో అమలవుతున్న స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.శకుంతల, మండల విద్యాశాఖాధికారి ఎం.సాయిశైలజ, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాసరావు, ఎంపీ ఫౌండేషన్ ప్రతినిధులు, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యా సంబంధిత పనుల్లో అలసత్వం వహించొద్దు

- జిల్లా విద్యాశాఖ నుంచి వచ్చే ఆదేశాలను తప్పకుండా అమలు చేయాలి
- ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్ల సమావేశంలో డీఈవో ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

పెందుర్తి: ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యా సంబంధిత కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. జిల్లా విద్యాశాఖ నుంచి వచ్చే సమాచారం/ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. బుధవారం పురుషోత్తపురం లోని బాలాజీ హైఫీల్డ్స్ పాఠశాల ఆవరణలో గోపాలపట్నం, పెందుర్తి మండలాల ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ముఖ్యంగా త్వరితగతిన అపార్ ఐడీలను జనరేట్ చేయాలన్నారు. డ్రాప్స్ డేటాను క్లియర్ చేయాలని, విద్యార్థుల అసెస్మెంట్ మోడల్ పేపర్ 1, 2 మార్కులను విద్యార్థుల హాజరు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. విద్యా సంబంధిత పనులు పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు సందేహాలను నివృత్తి చేశారు. ఉప విద్యాశాఖాధికారి రవీంద్రబాబు, ఎంఈవోలు డి.వి.త్రినాథరావు, టి.మధుమూర్తి, సోమేశ్వరరావు, దివాకర్, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఒక రోజు శిక్షణలో అధికారులు, ప్రజాప్రతినిధులు

పరవాడ: గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలపై ప్రజా ప్రతినిధులు దృష్టిసారించాలని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మ లక్ష్మి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన గ్రామాభివృద్ధి ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు మంజూరు చేస్తున్న నిధులను ప్రజా ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళిక రూపొందించుకుని, ఆ మేరకు పనులను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో అత్యవసర పనులకు ప్రాధాన్యతనిస్తామన్నారు. శిక్షణ కార్యాక్రమంలో పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, మండల పంచాయతీ విస్తరణాధికారి ధర్మారావు, మండల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీల్లో గురుకుల విద్యార్థి సత్తా



సంతోష్‌ను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

సింహాచలం: ఏలూరు జిల్లా చింతలపూడిలో ఇటీవల జరిగిన 68వ రాష్ట్రస్థాయి అండర్–17 స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ పోటీల్లో స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల టెన్త్ విద్యార్థి జె.సంతోష్ సత్తాచాటాడు. ఈ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని బుధవారం మీడియాకు తెలిపారు. విజయం సాధించిన సంతోష్‌ను, అందుకు సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులు కె.దుర్గాప్రసాద్, డి.అప్పారావులను అభినందించారు.

విజేతలకు బహుమతుల అందజేత



బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఆత్మకూరి కృష్ణకుమార్, రాధాకృష్ణన్ తదితరులు

సింహాచలం: బాలల దినోత్సవం, ప్రపంచ కంటి దృష్టి వారోత్సవాలను పురస్కరించుకుని గడచిన 8 రోజులుగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో విద్యార్థులకు నిర్వహిస్తున్న పోటీలు బుధవారంతో ముగిశాయి. కంటి వైద్యం, కంటి ఆరోగ్యం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలతోపాటు, దేశభక్తిపై బృందగానం, డిబేట్, స్టోరీ టెల్లింగ్, రోల్‌ప్లే తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. నగరంలోని 86 పాఠశాలల నుంచి 415 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని, తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీ అంశాల వారీగా విజేతలను ఎంపిక చేశారు. విజేతలకు శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డీజీఎంలు వి.రమేష్‌కుమార్, కె.బంగార్రాజు, శిక్షణ విభాగం ఉద్యోగులు భువన కల్యాణి, అలేఖ్య, జయ, దేవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వరికి మెరుగైన ధర



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ ఏవో ధనలక్ష్మి, రైతులు

పరవాడ: సేంద్రీయ పద్ధతిలో పండించిన వరి ధాన్యాన్ని సాగు ఉత్పత్తిదారుల సంఘంలో అమ్మకాలు సాగించడం ద్వారా మెరుగైన ధరలు పొందవచ్చని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి ధనలక్ష్మి రైతులకు సూచించారు. రావాడ గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వంద ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న వరి పంటలను పరిశీలించారు. ఈ నెల 15లోగా రైతులు జీడి తోటల పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. మామిడి, పెసర, మినప పంటలకు సంబంధించిన పంటల బీమాను డిసెంబర్ 15 నాటికి చెల్లించాలన్నారు. గ్రామ సర్పంచ్ ఎం.ఎస్.నాయుడు మాట్లాడుతూ దాల్వా సాగుకు అవసరమైన వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏఈవో మాసవరపు నరసింహమూర్తి, వ్యవసాయ సహాయకులు గౌతమి, రైతులు కావలి అప్పలరాజు, సత్యారావు, రమణ, ఎం.కుమారి పాల్గొన్నారు.

అవగాహనతో మెరుగైన గ్రామాభివృద్ధి ప్రణాళికలు



శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పద్మజ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025–26 తయారీపై బుధవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామ, మండల, జిల్లా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ఇప్పటికే తామంతా శిక్షణ తీసుకున్నామన్నారు. పంచాయతీ రాజ్, మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులకు ఈ శిక్షణ తరగతులను నిర్వహించారు. గురువారం మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు శిక్షణ ఉంటుందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యాచరణ ప్రణాళికల్లో భాగంగా గ్రామ ప్రజల్ని భాగస్వాముల్ని చేసి, స్థానిక సమస్యలను గుర్తించి ఆ మేరకు అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలన్నారు. మెరుగైన ప్రణాళికల రూపకల్పన కోసం ఏయే పనులకు ప్రాధాన్యతనివ్వాలి, నిధులు ఎలా సమకూర్చుకోవాలన్నదానిపై ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తామన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కిరణ్, ఎంఈవో లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిలుక ద్వాదశి



రోట్లో చిమ్మిలి దంచుతున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై బుధవారం సాయంత్రం చిలుక ద్వాదశి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనకాపల్లిలోని గవర సామాజిక వర్గానికి చెందిన ఆదారి నూకయ్య వంశస్తులే తరతరాలుగా ఈ ఉత్సవంలో పాల్గొంటున్నారు. ఈ ఏడాది కూడా నూకయ్య వంశీయులు ఉత్సవానికి సంబంధించిన పూజా ద్రవ్యాలతో హాజరవగా, అర్చకులు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థానమండపంలో అధిష్ఠింపజేశారు. షోడషోపచారపూజలు నిర్వహించారు. అనంతరం రోట్లో నువ్వులు, బెల్లం వేసి చెరకు గెడలతో దంచి చిమ్మిలి తయారుచేశారు. చిమ్మిలి ప్రసాదాన్ని స్వామికి ఆరగింపుచేసి, భక్తులకు పంచిపెట్టారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

గౌరమ్మకు సారె సమర్పణ



గౌరమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు

పెందుర్తి: గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో కొలువుదీరిన ఆదిదంపతులకు బుధవారం భారీ ఎత్తున సారె సమర్పించారు. చినముషిడివాడ పాతూరు రామాలయం నుంచి సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ ఆలయం వరకు రకరకాల పిండివంటలు, ఫలాలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం గౌరమ్మకు నైవేద్యంగా సమర్పించారు. గౌరీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొడ్డేడ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పెంటకోట జోగేశ్వరరావు, కోశాధికారి ఆదారి సత్యనారాయణ, మహిళా మండలి కార్యవర్గ అధ్యక్షురాలు ఆదారి ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి కొణతాల వరలక్ష్మి, కోశాధికారి భీశెట్టి అరుణ, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.